# "మహా చెడ్డది"

"లలితా శంకర్"



కాత్యాయని ఒక మామూలు అప్పర్ ప్రైమరీ స్కూల్ టీచరు. ఆరోజు స్టాఫ్ అంతటికీ కాఫీలు యిప్పించింది. "ఎందుకూ కాఫీలు? ఏమిటి విశేషం?" అంటూ చుట్టుముట్టబోయిన కొలీగ్స్‌ని ఒక్క నవ్వుతో ఆపేసి "చెప్తాగా. తొందరెందుకూ? ముందు తాగండి. "అంటూ చల్లగా పక్కనున్న తన క్లాస్ రూం లోకి వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ప్రారంభమైంది అసలైన చర్చ. ఆ గదిలో,... చాదస్తపు పంచెలున్నాయి, అత్యాధునికపు పేంట్లూ వున్నాయి. ముదిమి వయసు ముడులున్నాయి, ఒయ్యారాల జడలూ వున్నాయి. ఎవరి తీరు వారిది...ఎవరి ప్రత్యేకత వారిది. అందరూ మెత్తం మీద స్వేచ్ఛగా తమ తమ అభిప్రాయాలు వ్యక్తపరుస్తూ చర్చలో పాల్గొన్నారు. (వాక్స్వాతంత్ర్యం వర్ధిల్లు గాక!)

"మంచి పనిచెయ్యడానికే కాదు, చెడ్డ పని చెయ్యడానికి కూడా మనిషికి ధైర్యం వుండాలండీ."

అవును లెండి. కాని చిన్న సవరణ...మంచి పనికి కాదు, చెడ్డ పని చెయ్యడానికే ధైర్యం వుండాలంటాను నేను. ఏం? కాదా?" "అవును సుమా! ఆలోచిస్తూంటే అదీ నిజమే నన్పిస్తోంది." "మీ పిచ్చిగాని...మంచేమిటి చెడ్డేమిటండీ? అందులో ఇదీ వుంది, ఇందులో అదీవుంది. పోనీ మీ మట్టుకి మీరు ఆ రెండూ విడదీసి డెఫినిషన్నివ్వండి చూద్దాం."

"తప్పకుండానూ...ఎదటి వాడికి కష్టం కలిగించేదీ, నష్టం కలిగించేదీ చెడ్డపని. అలాగే పదిమందిని సంతోష పెట్టగలిగేది...లేదా ఆమోదయోగ్యమైనది మంచి పని. ఏం? కాదని అనగలరా?" "అంతేనంటారా?" "ఏమో! నా బుద్ధికి అంతే తోస్తున్నది మరి."

"అయితే ఈ లెక్కన మంచి వాళ్ళ కంటె చెడ్డవాళ్ళే ధైర్యవంతులంటారు!!" "కాక? హత్యలూ, దోపిడీలు, దొంగతనాలు మంచి పనలేరు కదా! కాని ఆవిధమైన పనులు చెయ్యడానికెంత తెగింపు, ధైర్యం వుండాలి? మీరే చెప్పండి పోనీ!"

"కాదనలేం. కానీ...నాకో చిన్న సందేహం...మరి మంచి లక్షణంగా ధైర్యాన్ని జమ చేసారు కదండీ మన పెద్దలు?! 'ధైర్యే సాహసే లక్ష్మి "అంటూ భుజం తట్టి మరీ ప్రోత్సాహిస్తారు!...ఈ లెక్కన కాత్యాయని చాల ధైర్య వంతురాలన్న మాట."

"ఇంకా సందేహమా?" "అయితే కాత్యాయని చేసినది చెడ్డపనే నన్నమాట!"

"ఇంతకీ ఆమె ఏంచేశారండీ?" కొత్తగా జాయినయిన ఒక 'జడ' కుతూహలం ఇది.

"పెద్ద గొప్ప పనేమీ కాదులెండి. తనని ఇరవై నాలుగ్గంటలూ శారీరకంగాను, మానసికంగాను కూడా హింసిస్తున్నాడని చెప్పి కట్టు కున్నవాడి నుండి విడాకులు యిప్పించమని అడుగుతోంది. కోర్టు వారిని. అదీ ఎప్పుడు? ముగ్గురు పిల్లలు పుట్టాక."

"అయితే విడాకులు కోరడం చెడ్డపనేనంటారు?! ఇద్దరికీ పడనప్పుడు అసహ్యించుకుంటూ ఓ కొంపలో వుండే బదులు విడిపోవడం మంచిదే కదండీ?!

"కట్టుకున్న వాడిని కాదని పోవడం మంచేవిటండీ? నామొహం. మేమెవ్వరం చెయ్యడం లేదా సంసారాలు?! మామొగుళ్ళు చెయ్యటం లేదా దాష్టీకాలు?! అందుకని...ఏకంగా పుస్తె, పూసా వాడి మొహాన పడేసి వచ్చేయటమే?! ఓర్పు...అదండీ కావల్సింది మనిషికి... అందునా పిల్లల తల్లికి...అంతేకాని ముగ్గురు పిల్లలు పుట్టాక మూటముల్లె కట్టుకొని నీకూ నాకూ 'కట్' అంటే ఇంక ఈ సంఘం...సాంప్రదాయం అన్నీ చట్టుబండలైనట్టేను?"

"అవును సుమండీ! ఎంతైనా యింత తెగింపు పనికి రాదు...ఎందుకని అంటారా? తన్నినా, తిట్టినా అడ్డమైన వాడి కాళ్ళూ పట్టుకొని ఆవిడకి ఈ వుద్యోగం వేయించింది ఆమొగుడే కదా! ఆ యింగితం అయినా లేకుండా ఇలా ప్రొబేషన్ పీరియడ్ దాటేసరికి అలా విడాకుల ప్రపోజల్ పెడుతుందా? పాపం...ఈవిడ జీతాన్ని నమ్మి అతగాడు హౌసింగ్ బోర్డులో స్థలం కూడా సంపాదించుకుని, ఇవాళో రేపో ఇల్లు కట్టాలని చూస్తుంటే... ఆమానవుణ్ణి ఇలా అర్థాంతరంగా ముంచేస్తుందా? అతగాడి వుసురు తగలదా?"

అదిగో...సరిగ్గా అప్పడే గదిలో ప్రవేశించింది కాత్యాయని. ఆమె మొహంలో నవ్వు కూడ కన్పిస్తోంది. ఆమె రాకతో రెండు నిమిషాలు మౌనం పాటించబడింది. ఆ గదిలో. ముందుగా తేరుకున్న ఓప్రాణం సన్నగా అడిగింది ఓ మూల నుండి" ఇంతకీ కాత్యాయని గారి కాఫీలకి కారణం ఏమిటో?"

గుండ్రంగా వున్న కుర్చీలో ఒకదానిని కాస్త పక్కకి లాగి కూర్చుంటూ నిండైన స్వరంతో చెప్పింది కాత్యాయని" కోర్టు వారు నాకు విడాకులతో పాటు, భరణం కూడ మంజూరు చేసారండీ, పిల్లల్ని కూడ నావాటాకీ వుంచేసారు కదా మావారు?! అందుకు. అంటే ఈ నెల నాకు జీవితంలో స్వేచ్ఛ తో పాటు, ఆదాయంలో మరో రెండు మూడు వందలు అధికం అవుతోంది. అదీ కారణం. సరే గ్నాని పండిట్ జీ! 'చెడ్డ' పనులు కూడ కొండకచో చట్ట సమ్మతములు. అంటే కాదనరు కదా మీరు?" కాఫీ ఆఖరి గుటక వేస్తున్న తెలుగు మాస్టారికి పొలమారింది. నెత్తి బాదుకున్నారు సున్నితంగా

"హమ్మో! కాత్యాయని ఉత్త చెడ్డదా?!...మాహా చెడ్డది." ●

---

'ఏనుగు' అని వ్రాయమంటే 'ఏనగ' అని రాశావేమిట్రా?

టీచర్ అడిగాడు.

"మీరే కదా సార్ 'ఏనుగు'కు కొమ్ములుండవని చెప్పింది"

విద్యార్థి సమాధానం.

"ఈ మధ్య పిచ్చివాడిలా కనిపిస్తున్నావ్, నీకేమైంది?"

"పెళ్ళి"

—చదువుల బాబు

